ఇరుగు పొరుగు

నేను ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి మా ప్రక్క ఇళ్ళ వాళ్ళు పోట్లాడుకుంటున్నారు. నా భార్య మా వాకిట్లో నిలబడి వింటూ వుంది.

మా ఇంటి ప్రక్క ఇళ్ళు, వరుసగా ఒక యింటిని ఒక ఇల్లు అనుకొని లేవు. ఒకే ఇల్లు మా ఇంటిని అనుకొనివుంది. రెండవ ఇల్లు దానికి ఎదురుగా వుంది. అందుకని మా వాకిటిలో నిలబడితే రెండిళ్లూ చక్కగా కనబడతై.

నేను వచ్చేటప్పటికి వాళ్ళు పోట్లాడుకుంటున్నారని చెప్పాను. వాళ్ళ రెండిళ్ళ మధ్యా ఒక పెద్ద గుమ్మడికాయ వుంది. అది వడియాలు పెట్టుకోటానికి పనికివచ్చే బూడిద గుమ్మడికాయ. గుమ్మడికాయకు అవతల ప్రక్క ఆ ఇంటి వాళ్ళూ ఇవతల ప్రక్క ఈ ఇంటివాళ్ళూ నిలబడి పోట్లాడుకుంటున్నారు. అవతల యిల్లు ఒక స్కూలు మేస్టరుది; ఇవతల యిల్లు ఒక గవర్నమెంటు ఆఫీసరుది. స్కూలు మేస్టరు ఇంటిలో వున్నట్లు లేడు. అతని భార్యా, కూతురూ, కొడుకూ, గుమ్మడికాయకు అవతల నిలబడి పోట్లాడుతున్నారు. గవర్నమెంటు ఆఫీసరు ఇంటిలోనే వున్నాడు. కాని అతను బయటకు రాలేదు. అతని తరపున అతని నౌకర్లు పోట్లాడుతున్నారు.

"ఈ గుమ్మడికాయ మీది. మీరు తీసుకోవలసిందే. మా అయ్యగారుకూడా ఈమాటే అన్నారు." అంటున్నాడు నౌకరు ఆఫీసరు తరపున.

"పాపం మీరెంత ఆపేక్షపడి దొంగతనంగా కోసుకున్నారో! కోసుకున్న వాళ్ళే తీసుకోవాలి." అంటున్నది మేస్టరు భార్య.

"ఈ దొంగముండ చేసింది." అంటున్నాడు నౌకరు అంట్లుతోమే పిల్లని ఉద్దేశించి.

"యజమానికి తెలియకుండా అదెందుకు చేస్తుంది? దానికోసం అది చేస్తే తన యింటికే తీసుకుపోయేది. మీ ఇంటిలో ఎందుకు పెడుతుంది?" అంటున్నది మేస్టరు కూతురు.

"ఆ మాటే అనొద్దనేది," అంటున్నాడు నౌకరు.

"చెయ్యగాలేనిది అంటే తప్పా?" అంటున్నది మేస్టరు భార్య.

"నోరు పారేసుకోకండి. ఈ కాయ మీది. మీరు తీసుకోండి." అంటున్నాడు నౌకరు.

"పాపం యెంత అపేక్షపడి దొంగతనంగా కోసుకున్నారో మీరే తీసుకోండి," అంటున్నది మేస్టరు భార్య.

ఇంతలో నన్ను చూచినట్లున్నారు. ఒక్క క్షణం మాటలు ఆగినై. నేను ఈ తగాదా విని విననట్లు లోపలకు వెళ్ళాను బయట తగాదా నేను ఇంటిలో అడుగు పెట్టగానే మళ్ళీ సాగింది.

మా ప్రక్క ఇంటినౌకర్లు ఇరుగు వాళ్ళతో చీటికీ మాటికీ కజ్జాకు దిగటం మామూలే! ఆఫీసరు నౌకర్లు, పుర ప్రముఖులకంటే కూడా అనేక రెట్లు గొప్పని నౌకర్ల ఉద్దేశం. అందుకని ఎవర్నిపడితే వాళ్ళని గదమాయించటం, ఎవ్వరితో పడితే వాళ్ళతో పోట్లాడటం వాళ్ళకి మామూలే! కాని 'ఈ గుమ్మడికాయ మీరు తీసుకోవాలంటే మీరు తీసుకోవా'లని పోట్లాడుకోవటం మాత్రం నాకు చిత్రంగావుంది.

ఆ మధ్య నా ఎరుకలో యిటువంటి తగాదే ఒకటి జరిగింది. దమనకశాస్త్రి అనే ఒకాయన, కరకటశాస్త్రి, అనే మరొక ఆయన్ని వంద రూపాయలు అప్పు అడిగాడు. కరటకశాస్త్రి వడ్డీగిడ్డీ తాను తీసుకోననీ, పలాని రోజుకల్లా తిరిగి యిచ్చివెయ్యాలనీ చెప్పి, అప్పు ఇచ్చాడు. కాని, దమనకశాస్త్రి ఆ నోట్లని తీరా యింటికి తీసుకువెళ్ళి లెక్కపెట్టుకునేసరికి, నూరు రూపాయిలకు బదులు నూట అయిదు రూపాయిలున్నాయి. అతను కంగారుపడి వెంటనే కరటకశాస్త్రి దగ్గరకువెళ్ళి "మీరు పొరపాట్న

అయిదు రూపాయిలు ఎక్కువ ఇచ్చారు. తీసుకోండి." అన్నాడు. ఈ మాటకు కరటకశాస్త్రి ఉలిక్కి పడ్డాడు. దమనకశాస్త్రి ముఖంలో వికతంగా చూస్తూ, నేను ఎప్పుడూ పొరపాటు పడను. నా డెబ్బయి ఏళ్ళ జీవితంలో ఏనాడు పడలేదు. ఇకముందు పడను. నేను వందరూపాయిలే యిచ్చాను. ఆ అయిదు రూపాయిలకూనాకూ యెటువంటి సంబంధమూ లేదు." అని చెప్పాడు.

"నేను సరాసరి ఇంటికివెళ్ళి లెక్కపెట్టుకున్నాను. ఇంకెక్కడికీ వెళ్ళలేదు కూడాను. లెక్కపెట్టుకునేటప్పటికి నూట అయిదు రూపాయిలున్నాయి. ఈ అయిదు రూపాయిలు మీవే. లేకపోతే నా దగ్గరకు యెలా వస్తాయి? అవి మీరు తీసుకుని నాకు చిత్తశాంతిని కలిగించండి" అన్నాడు దానికి కరటకశాస్త్రి "నీకు చిత్తశాంతిని కలిగించి నా చిత్తశాంతిని పోగొట్టుకోమంటావా?" అని అడిగాడు. "ఈ అయిదు రూపాయిలు తీసుకుని వచ్చే జన్మలో కుక్కగానో నక్కగానో పుట్టి నీ యింటి ముంగిట కాపలా కాయమంటావా?" అన్నాడు.

"నాతో ఆ పని చేయించుకోటానికే మీరీఎత్తు వేశారు. అసలు మీ దగ్గరకు డబ్బుకోసం రావటమే నా తప్పు!" అన్నాడు దమనకశాస్త్రి.

వీరీ విధంగా కరటకశాస్త్రి ఇంటి అరుగుమీద కూర్చొని పోట్లాడుకుంటూవుంటే పోగైన జనం వినలేక ఆ అయిదురూపాయిలు భగవదార్పితం చేసేటట్లు రాజీ చేశారు. "గుమ్మడికాయ నువ్వు తీసుకోవాలంటే నువ్వు తీసుకోవాలనే" ఈ తగాదా నాకు పై సంఘటనను జ్ఞాపకానికి తెచ్చింది. నాకునాకే నవ్వొచ్చింది. ఇంతలో వాకిటిలో నిలబడి తగాదాను పర్యవేక్షిస్తున్న నా భార్య లోపలకు వచ్చింది రావటంలో ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వచ్చింది.

"ఏమిటా గోల?" అని అడిగాను.

"అదేనండి.... నిన్న మీతో చెప్పాను చూడండి. మేష్టరుగారి

భార్య ఇంటిమీదకు గుమ్మడితీగ పాకించుకొని గుమ్మడికాయలు కాయిస్తూ వుందనీ, ఆ తీగ రెండు గుమ్మడికాయలు కాసిందనీ...."

"అవును" అన్నాను నేను జ్ఞాపకం చేసుకుంటూ.

"పాపం, అందులో ఒక కాయ నిన్నరాత్రి ఎవ్వరో కోసుకు వెళ్ళారట. రోజూ ఆవిడకు నిద్రమంచం మీద నుంచి లేచీలేవగానే నిచ్చెన వేసుకుని ఒక్కసారి రెండు గుమ్మడికాయల్నీ చూసుకోవటం అలవాటు. ఇవ్వాళ ప్రొద్దున్న లేచి చూచేటప్పటికి ఏముంది? గుమ్మడికాయని కప్పిన గడ్డిగడ్డిగానే వుంది. గుమ్మడికాయ లేదు...."

"ఎవ్వరో కోసుకువెళ్ళి వుంటారు" అన్నాను నేను.

"అది సరేలెండి...." అన్నది నా భార్య.... "ఎవ్వరూకోసుకు వెళ్ళకుండా ఎలా గుమ్మడికాయ మాయమవుతుంది లెండి కాని, పాపం ఆ ఇల్లాలు గుమ్మడికాయమీద అనేక ఆశలు పెట్టుకు కూచుంది. ఆమె అల్లుడికి వడియాలు అంటే తగని యిష్టమట. వడియాలు వుంటే ఏ కూరా అక్కరలేదట. ఈ గుమ్మడికాయ యివాళో రేపో కోసి వడియాలుపెట్టి అల్లుడికి పంపాలని గుమ్మడిపాదు పెట్టినప్పటినుంచీ అనుకుంటూ వుంది ఆమె. నిజానికి గుమ్మడిపాదు పెట్టింది కూడా అందుకేనట! అటువంటి ఆమెకు గుమ్మడికాయ కనపడక పోయేటప్పటికి ఏముంది? వొక్కసారి గుండె గుభేలుమన్నది. కళ్ళు తిరిగి నిచ్చెన మీదనుంచి పడిపోతాననే అనిపించిందట. కూతుర్ని పిలుద్దామంటే నోటివెంట మాట వస్తేగా...."

"పాపం" అన్నాను నేను. నాకైతే యిప్పుడు సరిగ్గా జ్ఞాపకం లేదుగాని, వొక్క నిట్టూర్పు కూడా విడిచివుంటాను. ఎందుకంటే నాకు నిజంగా జాలివేసింది. పెంచినవాళ్ళ మనస్సులను తీగెలూ కాయలూ ఎట్లా పెనవేసుకుంటయ్యో నాకు తెలుసు.

"అది సరే. గుమ్మడికాయ మధ్యన పెట్టుకొని, కృష్ణ భగవానుని మధ్యన పెట్టుకొని పోట్లాడే కౌరవ పాండవులకు మల్లే, దొడ్డిలో ఆ తగాదా ఏమిటి" అన్నాను.

“మరి చెప్పేదంతా వినండి.కాయకనపడకుండా పోయేసరికి ఆమెకు తలచుకున్నకొద్దీ దుఃఖం పొర్లి పొర్లి వచ్చిందట. ఎవ్వరు కోసివుంటారా అని ఆలోచించిందట. కాని ఎవర్ని అనుమానిస్తుంది? ప్రక్కయింటి గవర్నమెంటు ఆఫీసర్‌ని అనుమానిస్తుందా? మనల్ని అనుమానిస్తుందా? ఏమీతోచక దుఃఖం ఆపుకోలేక కోసుకువెళ్ళిన వాళ్ళని నోటికి వచ్చినట్టు తిట్టటం మొదలు పెట్టింది. వాళ్ళు నాశనం అవుతారన్నది వాళ్ళ పెళ్ళాలు నాశనం అవుతారన్నది. వాళ్ళు పిల్లలు నాశనం అవుతారన్నది. ఆమె, నోరు చేసుకుంటే ఎట్లా చేసుకుంటుందో మీకు తెలుసుగా!పాపం వడియాలు, అల్లుడూ జ్ఞాపకం వొచ్చారేమో, వైనవైనాలు పెట్టి అటుపధ్నాలుగుతరాల వాళ్ళనీ ఇటు పధ్నాలుగు తరాలు వాళ్ళనీ దుమ్మెత్తి పోసింది.

పాపం మన ప్రక్కయింటి ఆఫీసరు ఈ తిట్లను వినలేక పోయాడు కాబోలు, ‘అట్లా నోరు చేసుకోవద్దను. కాయ తీసుకోమను’ అని చెప్పి ఇంట్లోనుంచి గుమ్మడికాయ నౌకరు చేతికిచ్చి పంపించాడు. సరిగ్గా ఈ గుమ్మడికాయే. తెంపిన తొడిమ ఆరన్నా ఆరలేదు.”

“అదేమిటే? ఆయన దగ్గరకు యెట్లావచ్చింది?” అని ఆశ్చర్యంగా అడిగాను. గవర్నమెంటు ఆఫీసరు గుమ్మడికాయను దొంగిలించాడని నేను నమ్మలేక అడిగాను.

“అది నాకెట్లా తెలుస్తుంది? ఆయన మాత్రం ‘నౌకరి ముండ చేసింది. ఈ దొంగముండతో చచ్చేరోజు వచ్చింది’ అన్నాడు మా అందరికీ వినబడేటట్టు” అన్నది నా భార్య.

“పాపం, నిజమే అయివుంటుందే” అన్నాను నేను.

“నౌకరిది దొంగిలిస్తే అది తన ఇంటికి తీసుకువెళ్తుంది గాని, వీళ్ళకెందుకు యిస్తుంది! గుమ్మడికాయ చేదయ్యా? చేదైతే ఎందుకు దొంగిలిస్తుంది. అన్నది మేష్టారిగారి కూతురు.”

“అయితే ఆ ఆఫీసరే దొంగిలించాడంటావా ఏమిటి?

"ఆయన్ని ఎవ్వరంటారు? ఆయన మంచివాడే."

అకస్మాత్తుగా ఆఫీసరు భార్య జ్ఞాపకం వొచ్చింది నాకు. ఆవిడ మీద ఏ మాత్రం సద్భావం లేదు నా భార్యకి. ఆవిడ ఇంట్లో నౌకర్లతో, ఇరుగు పొరుగు వాళ్ళతో కజ్జాలూ తగాదాలూ ప్రోత్సహిస్తూ వుంటుందని ఆమె నమ్మకం.

"నౌకర్లతో ఆవిడ చేయించి వుంటుందంటావా ఏమిటి" అని అడిగాను.

"నే ననటం ఏమిటి? ఊరంతా అంటున్నారు. ఇది తప్పకుండా ఆవిడగారిపనే. మాష్టరుగారి ఇంటిమీద గుమ్మడికాయ లున్నాయని వాళ్ళకి తెలియాలి, మనకు తెలియాలి. ఇంకెవ్వరికి తెలుస్తుంది?"

"ఈ మాటలు నువ్వు గిట్టక అనే మాటలు" అన్నాను నేను.... "ఆవిడ చేయిస్తే ఆయన నౌకరిమీద ఎందుకు పెట్టేవాడు! ఆవిడని నానా చీవాట్లూ వేసేవాడు" అన్నాను.

"చీవాట్లువేసి బ్రతకనే ఆవిడగారితో" అన్నది నా భార్య.

"పోనీ మెదలకుండానైనా వూరుకునేవాడు. తమతప్పు బయట పెట్టుకునేవాడా? తాను మెదలకుండా వూరుకుంటే ఎవ్వరేం చేసేవారు?"

"ఊరుకునేవాడే! కాని ఆవిడగారు ఊరుకోనిస్తేగా?" అన్నది నా భార్య.

ఈ మాటకు నాకు నిజంగా కష్టం వేసింది. దొంగతనం చేయించిందీ ఆవిడే, ఆ దొంగతనం బయట పెట్టించిందీ ఆవిడే అంటూవుంటే ఏమనాలి?

"అదేమిటి అట్లా అంటావు. తాను చేయించిన దొంగతనం, తన భర్తతో బయట పెట్టించిందంటావా?" అని అడిగాను.

"ఆమాట నేనెట్లా అంటాను" అన్నది నాభార్య.

"మరదేగా నువ్వనేది?"

"అదికాదు. ఆ గుమ్మడికాయ ఉంచుకోలేక పోవటానికి కారణం వుంది. మీకు తెలుసుగా ఆవిడగారికి తన కొడుకంటే ఎంత ప్రేమో?"

"తెలియకేం?" అన్నాను. పిల్లలకోసం ఆమెనోయ్యని నోమూ, చెయ్యని పూజా, దర్శించని దేవళం లేదని నాకు తెలుసు. చివరికి ఆమె నోముఃపంటగా ఈ పిల్లవాడు ఇటీవలే కలిగాడు.

"దానివల్ల గుమ్మడికాయ దాచుకోలేక పోయింది. మాష్టరుగారి భార్య మాటి మాటికీ 'కోసినవాళ్ళ కడుపులుకాల! తీసినవాళ్ళ పిల్లలు నాశనం కాను!' అంటూ వుంటే భరించలేకపోయింది. పస్తాయిస్తే లాభం లేదనుకొని, నౌకరి దానిమీదపెట్టి 'వాళ్ళకాయ వాళ్ళకిచ్చి వెయ్యండి' అని భర్తతో చెప్పి వుంటుంది. ఆ పిచ్చాయన నిజమే అని నమ్మి బయట పడ్డాడు" అన్నది.

నేను ఆలోచనలో పడ్డాను. నాభార్య చెప్పింది నిజం కావచ్చు అనుకున్నాను. ఆఫీసరు భార్య ఇటువంటి పనులకు సమర్థురాలే. ఒకరోజు మా పిల్లలు ఏదో చేశారనే కోపంతో తన పని దాంతో ఊడ్చిన కసవు సరిహద్దు గోడమీదుగా మా దొడ్లోకి వేయించటం నేను కళ్ళారా చూశాను. తన వాకిట్లో నిలబడి పనిదాంతో ఈపని చేయిస్తూవుంది. నన్ను చూచి చటుక్కున లోపలకు వెళ్ళింది. ఇటువంటివి నేను చాలా చూశాను. అందుకని 'బహుశా నాభార్య చెప్పిన మాటలు నిజమే అయివుండవచ్చు' అనిపించింది నాకు.

"అదిసరే. వాళ్ళు ఏ కారణంవల్లయినా కానీ, గుమ్మడికాయ ఇచ్చివేసినపుడు సంతోషంగా, తీసుకోక 'ఎంత అపేక్షపడి కోసుకున్నారో మీరే తీసుకోండి' అని మొండి పట్టు పట్టుకు కూర్చుంటారేం? మాష్టరిగారి భార్యా, కూతురూను" అని అడిగాను.

"కసి తీరక?" అన్నది నా భార్య.

నాకు అర్థంకాలేదు. "ఇందులో కసితీరే దేముంది?" అని అడిగాను.

"ప్రొద్దున్నుంచీ ఆమె ఏడ్చిన ఏడ్పుకి కాయఇవ్వగానే తీసుకు ఊరుకుంటే యెట్లా సరిపోతుంది? అప్పటిదాకా అన్నమాటలన్నీ పిల్లిమీదా కుక్కమీద పెట్టి అనే! ఒక్క మాటకూడా సరాసరి అనకపోయే....కాయ యివ్వగానే తీసుకుంటే వాళ్ళనిఒక్కమాటకూడా అనటానికి వీల్లేదాయె.... అనకుండా వూరుకోబుద్ధి పుట్టదాయే!"

"అందుకని 'మీరే తీసుకోండి' అంటూ అనవలసిన మాటలన్నీ అని తన అక్కసు తీర్చుకుందన్నమాట."

"అవునండీ. ఎవరికైనా కడుపుమంట చల్లారాల్సిందే గదా!" అన్నది నాభార్య.

"చల్లారాల్సిందే" అని నేను నా భార్యతో యేకీభవించి, "చివ్వరికి కథ ఎట్లా ముగిసింది?" అని అడిగాను.

"ఏదోలెండి–నేనే రాజీచేశాను" అన్నది నా భార్య.

"ఎట్లా?"

"ఎట్లా యేముంది?వారికి తెలిసే యిదిజరిగి వుంటుందనుకుందాం.... మీరు అనుకుంటున్నట్లు నౌకర్లతో ఆబిడగారే చేయించి వుంటారని అను కుందాం. అయినా 'మేము ఎరగం, నౌకరుది చేసివుంటుంది' అని వారన్న పుడు దాన్ని మీరు ఇంకా సాగదియ్యటం ధర్మంకాదు. మీ కాయ మీరు తీసుకోవటమే ధర్మం అని మాష్టరుగారి భార్యకు చెప్పాను" అన్నది.

"అవట్న ఆమె తీసుకుందా?"

"అంత తేలిగ్గా తీసుకుంటుందా? 'పోనీ, యజమానులకు తెలియ కుండా ఆ నౌకరుది యింతపనికి దిగి వుండదని మీరైనా ఒప్పుకుంటారా? మీరు ఒప్పుకుంటే నాకు అదేచాలు. గుమ్మడికాయ తీసుకోవటానికి మాకెట్టి

ఆక్షేపణాలేదు——" అన్నది మాష్టరుగారి భార్య. ఎట్లాగో ఒకట్లా ముగుస్తుంది గదా అని 'నేమ ఒప్పుకుంటాను అనుకోండి' అన్నాను. 'అయితే సరే. నాకదేచాలు పదిమందికీ తెలిసి ఉండాలనే, నే కోరేది' అన్నది మాష్టరుగారి భార్య. అని గుమ్మడికాయ తీసుకుంది."

నా భార్య రాజీపరిచిన పద్ధతి నేను శ్రద్ధగా విన్నాను. విని "అయితే ఈ అవకాశం పురస్కరించుకొని ఆఫీసరు భార్యగారిమీద నీకున్న కసి కూడా తీర్చుకున్నా వన్నమాట?" అన్నాను.

ఈ మాటలకు నా భార్య కళ్ళు తళుక్కున మెరిసినై. ముసి ముసి నవ్వులు వొలకపోసుకుంటూ—"లేకపోతే, పెద్దరాణీని అనుకుంటుంది!" అన్నది. అని అంతటితో ఆగక "చూడండీ, అల్లుడితోపాటు మనకుకూడా కొన్ని వడియాలు పెట్టిస్తానన్నది మాష్టరుగారి భార్య" అని చెప్పింది.

—o—